క్లుప్తంగా

నేడు చియ్యవరంలో గడప గడపకు..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం చియ్యవరంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు.

'మధ్యాహ్న భోజనం' పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న మోహనప్రియ

ఏర్పేడు: మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. సోమవారం మండలంలోని ఎండీపుత్తూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

విద్యుత్ మోటార్ చోరీ

కేవీబీపురం: వ్యవసాయ విద్యుత్ మోటార్ చోరీకి గురైన సంఘటన మండలంలోని పెరిందేశంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన సుబ్బరామనాయుడు తన పొలాలకు సాగునీరు నిమిత్తం విద్యుత్ మోటార్‌ను స్థానిక వాటర్ ట్యాంకు వెనుకవైపు ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా తాళం పగలగొట్టి మోటార్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదలా ఉంచితే మండలంలో దొంగలు తమ ప్రతాపం చూపుతున్నారు. ఐదునెలల కాలంలో సుమారు 20 విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. కోవనూరు, బ్రాహ్మణపల్లె, కండ్లూరు, అంజూరు పాళెం, ఆదవరం గ్రామాల్లో ఈ చోరీ ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. పోలీసులు దీనిపై దృష్టి సారించి మోటార్ల దొంగల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు నగదు అందజేస్తున్న సర్పంచ్ నగేషం, ప్రభాకర్

రేణిగుంట: స్థానిక పోస్టాఫీస్ వీధివాసి ఆటో డ్రైవర్ మహ్మద్ జానీ సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. పార్టీ నాయకుల ద్వారా ఇది తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం చేతుల మీదుగా ఈ సాయ అందజేశారు.

'చెంగాల్వ' ఆక్రమణలు అడ్డుకోవాలని వినతి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం టీపీ కోట వద్ద సర్వే నంబర్ 52/2లోని చెంగాల్వను కొందరు ఆక్రమించుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని అడ్డుకోవాలని సోమవారం నాగలాపురం తహసీల్దారు ప్రసన్నకుమార్‌కు టీపీ కోట రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ కాలువపై గతంలో ప్రభుత్వం చెక్‌డ్యామ్‌ను సైతం నిర్మించిందని, ఆక్రమణదారులు చెక్‌డ్యామ్‌ను సైతం తొలగించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

టైలర్ల సంఘం నేత మృతి



రాజాబాయ్(ఫైల్)

పిచ్చాటూరు: కీళపూడికి చెందిన మండల టైలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు రాజాబాయ్(72) సోమవారం మరణించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరు దశాబ్దాలుగా స్థానిక బజారు వీధిలో టైలర్ షాపు నిర్వహిస్తున్న ఆయన పలువురికీ సుపరిచితులు. అసోసియేషన్ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

వచ్చే వైకుంఠ ఏకాదశికి ఆలయ పునర్నిర్మాణం

తిరుపతి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయాన్ని వచ్చే వైకుంఠ ఏకాదశి నాటికి పునర్నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. తమ పాలకమండలి రాక మునుపే జీర్ణోద్ధరణ పనులకు బాలాలయం ఏర్పాటు చేశారన్నారు. అయితే మొదటి టెండర్ టెక్నికల్ సమస్య వల్ల ఖరారు కాలేదన్నారు. రెండవ టెండర్ ఖరారు చేసినట్లు తెలిపారు. మరో రెండ్రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాతి కట్టడంతో అద్భుతంగా నిర్మించే విధంగా డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు.

వైకుంఠవాసా.. గోవిందా!

- వైకుంఠ ఏకాదశి పూజలకు పోటెత్తిన భక్తులు



శ్రీకాళహస్తి: అభయహస్త వేంకటేశ్వరస్వామికి మొక్కుతున్న అంజూరు, పాలకమండలి సభ్యులు, భక్తులు

శ్రీకాళహస్తి: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తిలో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో తోపులాటలకు ఆస్కారం లేకుండా క్యూలు ఏర్పాటు చేయడంతో తెల్లవారుజామునుంచే ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామిలో మరమ్మతుల కారణగా బాలాలయం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే, శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అభయ హస్త వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతంతో అభిషేకం అనంతరం పలు రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని వివిధ గ్రామాల ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. వికృతమాల సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పసుసులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలు, పండ్లు, కూరగాయలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలు, వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పేడు పల్లి వీధి రామాలయంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో విశేష పూజల అనంతరం 750 మంది భక్తులకు అన్నదానం చేశారు. గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయం, కందాడు సదాశివేశ్వర స్వామి, పాపానాయుడుపేట భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి, రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు చేశారు. అలాగే అంజిమేడు పంచాయతీ ఎర్రమిట్ట గ్రామంలోని శ్రీరాముల ఆలయంలో పూలంగి సేవ వైభవంగా నిర్వహించారు.

సత్యవేడు నియోజకవర్గం

సత్యవేడు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సత్యవేడులో సోమవారం కళ్యాణ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి, ఉత్సవ మూర్తికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావువీధి, గంగమ్మవీధులలో స్వామి వారిని ఊరేగించారు. ఇంటింటా భక్తులు టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నాగలాపురంలో..

పిచ్చాటూరు: నాగలాపురం మండల కేంద్రంలోని స్వయంభు వేదనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడీ సిబ్బంది ఆలయాన్ని విద్యుదీపాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం 2 గంటలకు ఆలయాన్ని తెరచిన అర్చకులు తిరుప్పావై, ధనుర్మాస పూజల అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఆలయంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. ఉభయనాంచారుల సమేత స్వామివారిని విశేషంగా అలంకరించి ఆస్థానం నిర్వహించారు. రాత్రి తిరువీధుల్లో ఊరేగించారు.



ఏర్పేడు: సంతాన సంపద వెంకటేశ్వరస్వామి ఆలయంలోకి వెళ్తున్న భక్తులు



సత్యవేడు: స్వామివారి ఊరేగింపు

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నారాయణవనంలో..

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వెంకన్న ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై ఆలయంలోని సంపంగి ప్రాకారంలో విహరించారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు ఉభయ నాంచారుల సమేత వెంకన్న ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక స్నపన తిరుమంజనాన్ని వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆలయ భద్రతా జమేదార్ విజయకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక వీరరాఘవస్వామి ఆలయం, పాలమంగళం ఉత్తరపు కండ్రిగలోని రాములవారి ఆలయం ఏకాదశి అభిషేకాలను నిర్వహించారు.



నాగలాపురంలో ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణస్వామి



వరదయ్యపాళెంలో..



నారాయణవనం: ఏకాదశి ఉత్సవంలో ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్న



బీఎన్‌కండ్రిగ: శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్థానిక శ్రీ పసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం భక్తులు ఉదయం పూజలు, అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

శ్రీసిటీలో..

వరదయ్యపాళెం: శ్రీసిటీ నర్సరీ ఆవరణలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. విష్ణుసహస్ర నామార్చన, గణపతి, నవగ్రహ, సుదర్శన హోమ పూజలు నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి పూజల్లో పాల్గొన్నారు. శ్రీసిటీలోని శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హరికథ, కోలాటం, సంక్రాంతి గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల ఆట కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎండీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.





శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమ పూజలు చేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఆలయ ప్రాంగణంలో కోలాటమాడుతున్న మహిళలు, బాలికలు

పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్యంపై సమీక్ష



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ఐడీలను ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇవ్వాలని సీడీపీఓ దేవకుమారి అన్నారు. పునరుత్పత్తి–పిల్లల ఆరోగ్యంపై సోమవారం తన కార్యాలయంలో సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీడీఓ సమీక్షించారు. గర్భిణులు, పిల్లల వివరాలు ప్రతి నెలా ఏఎన్‌ఎంలు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం స్థాయిలో గర్భిణులకు వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించి మాతా–శిశు మరణాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి బాధ్యత ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలపై కూడా ఉందన్నారు. రానున్న శివరాత్రి రోజుల్లో బాల్యవివాహాలు జరగకుండా ఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నిరు. పంచాయతీలు గ్రామ సభలు, ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, సంధ్య, జ్యోతి, యమున తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో నేడు ద్వాదశి ద్వారోత్సవం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం భక్తులకు ద్వాదశి ద్వార ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు. సాధారణ, 20 రూపాయల ప్రత్యేక, వీఐపీలకు మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని వైష్ణవాలయాల్లో ఏకాదశి రోజుల ఉత్తర ముఖ ద్వార ప్రవేశాన్ని భక్తులకు కల్పిస్తారు. నారాయణవనం కల్యాణ వెంకన్న ఆలయంతో పాటు తమిళనాడు శ్రీరంగ రఘునాథస్వామి ఆలయంలో మాత్రమే ద్వాదశి రోజున భక్తులను ద్వార ప్రవేశానికి అనుమతిస్తారు. ఇదే ఇక్కడి ప్రత్యేకత.

రేణిగుంట అభివృద్ధికి కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట: పంచాయతీలో ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రేణిగుంట సర్పంచ్ నగేషం అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సమస్యలపై చర్చించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తెలుగుగంగ నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నాలుగు బోర్లు వేశామన్నారు. అలాగే రూ.2కోట్లతో సీసీ రోడ్లు వేసినట్లు చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు, వామపక్షాల నాయకులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పంచాయతీ ఈవో విజయభాస్కర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజా, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చేమూరులో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చేమూరులో సోమవారం కాసారం వైద్యాధికారి డాక్టర్ అనూష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితులను పరీక్షించారు. వైరల్ ఫీవర్‌గా నిర్ధారించి మందులు అందజేశారు. అలాగే కోవిడ్ కొత్త వేరియంట్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, శానిటైజర్ వాడడం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కోవిడ్ లక్షణాలు ఉన్న వాళ్లు సచివాలయం పరిధిలో నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శాంతకుమారి, ఏఎన్‌ఎం రోజా, ఎంఎల్‌పిహెచ్ జలజ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పూడిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పూడి, శేషం నాయుడుకండ్రిగ, పెన్నలపాడు, కొన్నలి గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు మదనమోహన రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో కేతినేని వెంగళరావు, తీర్థ రామన్, దీపక్‌రెడ్డి, అశోక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషవాహనంపై ముక్కంటి చిద్విలాసం



శేష, యాళి వాహనాలపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి సోమవారం శేష, యాళి వాహనాల్లో పురవిహారం చేశారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు అభిషేక పూజల అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీకాళహస్తీశ్వరస్వామిని శేషవాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు యాళివాహనాన్ని అధిష్ఠించారు. పురవీధుల్లో మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. స్వామి అమ్మవారికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొట్టంబేడు, కేవీ.పురం, బీఎన్ కండ్రిగ మండలాల్లో 4 అంగన్‌వాడీ కార్యకర్తలు, మూడు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 20 హెల్పర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఫర్జానా తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్, మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులు 8వ తరగతి కంటే తక్కువ కాకుండా అర్హత కలిగి ఉండాలన్నారు. ఏడాదిపాటు ఒప్పందంపై పాస్, ప్రతి ఏటా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు 1.1.2022 నాటికి 21–35 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎక్కడెక్కడ పోస్టులు ఖాళీగా ఉన్నాయో సమాచారం తెలుసుకునేందుకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బీఎన్ కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, నీర్పాకోట ఎస్టీ కాలనీలలోని ఎస్టీ మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు, బుచ్చినాయుడుకండ్రిగ, ఆదిరెడ్డికండ్రిగ, కాటూరు గ్రామాల్లో జనరల్ కింద, నీర్పాకోటలోని ఎస్టీ కాలనీలోని కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ రత్నమ్మ కోరారు. 7వ తేదీ లోపు దరఖాస్తులను తొట్టంబేడులోని అంగన్‌వాడీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: పడివేటమ్మ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టుకు ఈనెల 7వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ నగరి ప్రాజెక్ట్ అధికారి కృష్ణవేణి తెలిపారు. స్థానికంగా నివాసముంటూ 10వ తరగతి పాసైన ఎస్టీ కేటగిరి వివాహిత నగరి కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

పారదర్శక పాలన జగనన్నకే సాధ్యం

- వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో ఎమ్మెల్యే ఆదిమూలం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వృద్ధురాలు, చిత్రంలో ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

నారాయణవనం: పారదర్శక ప్రభుత్వ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలో లబ్ధిదారులకు మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను సోమవారం ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలో కొత్తగా 157 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైందని, దీంతో మొత్తం పెన్షన్ల సంఖ్య ఆరువేలకు చేరుకుందన్నారు. పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తున్న పెన్షన్లపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, టీడీపీ పాలనకు తేడాను వివరిస్తూ విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అలాగే వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులు విధిగా ప్రతి గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని తెలియజేయాలన్నారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడుతూ, సత్యవేడు నియోజకవర్గానికి మూడేళ్ల కాలంలో రూ.160 కోట్లను వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చుపెట్టిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో టీడీపీ కార్యకర్తలు కూడా అధిక శాతం లబ్ధిపొందుతున్నారని, వలంటీర్లు, కన్వీనర్లు సమావేశాలు నిర్వహించి దీనిని చాటి చెప్పాలన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, పార్టీ కన్వీనర్ సారకాయలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు ఊరప్ప, కోన చైర్మన్ సుబ్రమణ్యం, పార్టీ నాయకులు ఏకాంబరం, రాజారెడ్డి, సుబ్బరాయశెట్టి, అన్నాదొరై, ఊరప్ప, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో..

పిచ్చాటూరు: రూ.2750 పెన్షన్ పెంపుతో గ్రామాల్లో ముందే పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం పిచ్చాటూరు, నాగలాపురం మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో ఎమ్మెల్యే, లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. పిచ్చాటూరు మండలంలో 102 మందికి, నాగలాపురం మండలంలో 142 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు.

పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

వైఎస్‌ఆర్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. పిచ్చాటూరులో పార్టీ నేత వెంకటరామిరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హెచ్.రేఖ, జెడ్పీటీసీ సభ్యులు కె.విష్ణుప్రియ, పార్టీ మండల కన్వీనర్‌లు కేటీ హరిశ్చంద్రా రెడ్డి(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, టౌన్ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, ఎంపీడీఓలు శ్రీనివాసులు, పద్మజ, తహసీల్దార్లు మధుసూదన్ రావు, ప్రసన్నకుమార్, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదురై, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. అదేవిధంగా గ్రామ సచివాలయ నిధులతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి: బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు. ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన హేమంత్, గీతిక, ప్రశాంతి, నవీన్ ప్రతిభ కనబరచారు. బాలికల విభాగంలో గీతిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, పీడీలు వెంకటముని, సరోజిని, ఇందిర, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రామాభివృద్ధి



పెన్షన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు, కన్వీనర్లు

నారాయణవనం: అభిప్రాయబేధాలకు అవకాశం లేకుండా గ్రామాభివృద్ధిని సాధిస్తూ ఆదర్శ సచివాలయంగా సముదాయాన్ని తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులు తీర్మానించారు. సోమవారం సాయంత్రం మండలంలోని సముదాయం గ్రామ సచివాలయ కన్వీనర్ నాదమునిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిధులకు తోడు జిల్లా, మండల పరిషత్ నిధులతో సముదాయం, వీకే పాళ్యం పంచాయతీలలో మౌలిక వసతులను కల్పించడంతో పాటు మురుగు కాలువల నిర్మాణం, పారిశుధ్యం తదితర పనులను చేపడుతామని సర్పంచులు సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి పేర్కొన్నారు. అరుణానదీ పరీవాహిక పొలాల నుంచి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకట్ట వేయాలని తీర్మానం చేశారు. అనంతరం కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్లు భారతి, గోపాల్, కార్యదర్శి భారతి, సచివాలయ సిబ్బంది, రెండు పంచాయతీల వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.